ఏఎంపీఎఫ్ దశాబ్ది వేడుకల్లో మాజీ కౌన్సిలర్ మల్లెపాక మల్లేష్‌కు ఘన సన్మానం



దశ, పెద్ద అంబర్‌పేట: అ బ్బు ల్లా పూ ర్ మె ట్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ (AMPF) పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం పెద్ద అంబర్‌పేటలో నిర్వహించిన దశాబ్ది కృతజ్ఞత కూడిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్ద అంబర్‌పేట మాజీ కౌన్సిలర్ మల్లెపాక మల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ నిర్వాహకులు మల్లెపాక మల్లేష్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేసి గౌరవించారు. పదేళ్లుగా ఐక్యత, ఆధ్యాత్మిక సేవాభావంతో ముందుకు సాగుతున్న పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులను ఆయన అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఐక్యతా కార్యక్రమాలు, సమాజ సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తూ ఫెలోషిప్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాస్టర్లు, ఫెలోషిప్ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

దీపావళి వేడుకలు భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలి

బాణసంచా దుకాణదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



దశ, ఆమనగల్లు : దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా విక్రయదారులు భద్రతా ప్రమాణాలు, లైసెన్స్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆమనగల్లు ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు సూచించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో బాణసంచా దుకాణాల యజమానులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ, అనుమతి పొందిన ప్రాంతాల్లోనే లైసెన్సులతో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి దుకాణంలో నీటి బకెట్లు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని, విద్యుత్ వైరింగ్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. దుకాణాల వద్ద నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు నిషేధిత, అనధికార బాణసంచా విక్రయించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే లక్ష్యంగా పోలీసులకు సహకరిస్తూ దీపావళి పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన

రాయికల్ టోల్‌గేట్ వద్ద 42 మందికి ట్రాఫిక్ నిబంధనలపై సూచనలు



దశ, షాద్‌నగర్ : రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు రాయికల్ టోల్‌గేట్ వద్ద గురువారం సాయంత్రం వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత డ్రైవింగ్‌పై ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాల డ్రైవర్లు, రోడ్డు వినియోగదారులు కలిపి సుమారు 42 మందికి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేశం ఆధ్వర్యంలో ఎస్ఐ, ఏఎస్ఐ, ఇతర ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సరైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం, ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయడం, రాంగ్ రూట్‌లో వెళ్లడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి ఉల్లంఘనల వల్ల జరిగే ప్రమాదాల తీవ్రతను వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని పోలీసులు కోరారు.

అక్రమ ఫైనాన్స్ ముఠాపై పోలీసుల ఉక్కుపాదం!

- *మరో నలుగురి అరెస్ట్.. ఇప్పటివరకు ఏడుగురు పట్టివేత.. రెండు కార్లు సహా భారీగా పత్రాలు స్వాధీనం.*



దశ, ఎల్‌బీనగర్: అధిక వడ్డీల పేరుతో అమాయకులను, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని రుణాల ముసుగులో మోసాలకు పాల్పడుతున్న ముఠాపై మల్కాజిగిరి పోలీసులు కొరడా ఝళిపించారు. ప్రత్యేక ఆపరేషన్ బృందం (ఎస్ఓటీ) ఎల్‌బీనగర్ జోన్, ఎల్‌బీనగర్ పోలీసులు సంయుక్తంగా మరో నలుగురు నిందితులను గురువారం అరెస్ట్ చేశారు. గత నెల 26న ముగ్గురిని అరెస్ట్ చేయగా, తాజా అరెస్టులతో మొత్తం ఏడుగురు పోలీసుల అదుపులోకి వచ్చారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ ముఠా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వృద్ధులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసరంగా డబ్బు అవసరమైన వారిని లక్ష్యంగా చేసుకునేది. పరిచయస్తులు, మధ్యవర్తుల ద్వారా బాధితులను సంప్రదించి భారీ మొత్తంలో రుణాలు ఇప్పిస్తామని నమ్మించేది. రుణాలు మంజూరు చేయకముందే అడ్వాన్స్ వడ్డీ పేరుతో భారీ మొత్తాలు వసూలు చేసేది. హామీ ఇచ్చిన మొత్తంలో కొంత మాత్రమే చెల్లించి, పెద్ద మొత్తంలో రుణం ఇప్పిస్తామంటూ మరిన్ని డబ్బులు వసూలు చేసేది. ఇచ్చిన రుణానికి మించిన మొత్తాలతో ప్రామిసరీ నోట్లు, బాండ్లు, ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకునేది. బాధితులు అప్పులు తిరిగి చెల్లించినప్పటికీ ఆ పత్రాలను తిరిగి ఇవ్వకుండా అదనపు డబ్బుల కోసం వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు చెల్లించాలని ప్రశ్నించిన వారిని క్రిమినల్ కేసులు పెడతామని, భౌతికంగా హాని చేస్తామని బెదిరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

ఈ ముఠా బారిన పడిన వారిలో క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించే ఏఐ ఆధారిత యంత్రాన్ని కొనుగోలు చేయాలనుకున్న ఓ వృద్ధ మహిళా వైద్యురాలు కూడా ఉన్నారు. ఆర్థిక సహాయం చేస్తామని నమ్మించి ఆమె నుంచి డబ్బులు, పలు ఆర్థిక పత్రాలు తీసుకోవడంతో పాటు స్కోడా కారు, టయోటా ఇన్నోవా హైక్రాస్ వాహనాలను బలవంతంగా స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ ఉపాధ్యాయురాలు, డ్రైవర్, అతని స్నేహితుడు, రిటైర్డ్ పశుసంవర్ధక శాఖ ఉద్యోగి కూడా ఈ ముఠా చేతిలో ఆర్థిక వేధింపులకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. తాజాగా అరెస్టయిన వారిలో కుంభం నాగమ్మ (48), కందెల గంగమ్మ (45), కందెల మంగమ్మ అలియాస్ రాణి (36), అడుల్ల అనూష (32) ఉన్నారు. గత నెల 26న కందెల శివకుమార్ అలియాస్ వరుణ్, వగ్గిగిరి ఇంద్రమ్మ అలియాస్ లక్ష్మి, గైక్వాడ స్వప్నలను పోలీసులు అరెస్ట్ చేశారు.

రెండు కార్లు సహా కీలక పత్రాలు స్వాధీనం

నిందితుల నుంచి టయోటా ఇన్నోవా హైక్రాస్, స్కోడా కార్లతో పాటు 12 మొబైల్ ఫోన్లు, రెండు తెలంగాణ పట్టాదారు పాస్ పుస్తకాలు, 25 ప్రామిసరీ నోట్లు, 22 ఖాళీ చెక్కులు, రెండు సేల్ డీడ్లు స్వాధీనం చేసుకున్నారు. కుంభం నాగమ్మ వద్ద రూ.33,010, కందెల గంగమ్మ వద్ద రూ.14,680 నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మరో 20 మంది బాధితులపై ఆరా

ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఏడుగురు బాధితులను గుర్తించి విచారించినట్లు పోలీసులు తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో మరో 20 మంది సంభావ్య బాధితుల వివరాలను పరిశీలిస్తున్నారు. మొత్తం నాలుగు క్రిమినల్ కేసులు ఎల్‌బీనగర్, నేరేడ్‌మెట్, కీసర పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయి. మరో నలుగురు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. నిందితులపై చట్టప్రకారం పీడీ యాక్ట్ ప్రయోగించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఖాళీ చెక్కులపై సంతకాలు చేయవద్దు

ప్రైవేట్ వ్యక్తులు, అనధికారిక ఫైనాన్సర్ల వద్ద రుణాలు తీసుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, బాండ్లపై సంతకాలు చేయవద్దని హెచ్చరించారు. ఇలాంటి మోసాలు, బెదిరింపులకు గురైన బాధితులు సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ బృందాన్ని సంప్రదించాలని కోరారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ పర్యవేక్షణలో, ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ, ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్ తదితర అధికారుల మార్గదర్శకత్వంలో ఈ అరెస్టులు జరిగాయి.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

విద్యార్థులకు సీపీ తరుణ్ జోషి పిలుపు



- *ఐసీఫాయ్ యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమం.. ప్రతిజ్ఞ, పుస్తకం, ప్రత్యేక పాట ఆవిష్కరణ*

దశ, శంకర్‌పల్లి : యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు కూడా దెబ్బతింటుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గురువారం శంకర్‌పల్లిలోని ఐసీఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐఎఫ్‌హెచ్ఈ) క్యాంపస్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ డాక్టర్ తరుణ్ జోషి మార్గదర్శకత్వంలో, యూనివర్సిటీ యాంటీ నార్కోటిక్స్ సెల్ సహకారంతో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, విద్యాసంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. తమ స్నేహితులు, పరిసర ప్రాంతాల్లోనూ మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కల్పించాలని కోరారు. యువతను డ్రగ్స్ నుంచి కాపాడటం కుటుంబాలు, విద్యాసంస్థలు, పోలీసులు, సమాజం ఉమ్మడి బాధ్యత అని స్పష్టం చేశారు. చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటి వల్ల కలిగే నష్టాలను తెలుసుకోవాలని సూచించారు. డ్రగ్స్ రహిత వాతావరణం కల్పించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

కార్యక్రమంలో విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతో పాటు ఇతరులను కూడా వాటికి దూరంగా ఉంచేందుకు కృషి చేస్తామని, మాదకద్రవ్యాల కార్యకలాపాల సమాచారాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ప్రతినబూనారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన పుస్తకాన్ని, ప్రత్యేక పాటను సీపీ తరుణ్ జోషి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌హెచ్ఈ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ. వినయ్‌కుమార్, ఎస్పీ పి. సీతారాం, చేవెళ్ల ఏసీపీ బి. కిషన్‌గౌడ్, ఈగల్ ఫోర్స్ అధికారులు, యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చట్టాలపై పోలీసుల అవగాహన

- *మైనర్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సీఐ శంకరయ్య*

దశ, హయత్‌నగర్: విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాలు, పౌర హక్కులు, సామాజిక బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని హయత్‌నగర్ సీఐ శంకరయ్య సూచించారు. హయత్‌నగర్‌లోని మేపుల్ ఫోర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమానికి ఆయనతోపాటు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ శంకరయ్య మాట్లాడుతూ.. సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని, సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పోలీసు సహాయం కోసం 112కు, సైబర్ ఆర్థిక మోసాల ఫిర్యాదుల కోసం 1930కు ఫోన్ చేయాలని వివరించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలతో పాటు తల్లిదండ్రులు కూడా చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రజల రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని, అవసరమైనప్పుడు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవి, పాఠశాల డైరెక్టర్ సుబ్బారావు, అసిస్టెంట్ డైరెక్టర్లు స్వాతి, శ్వేత, ప్రిన్సిపాల్ స్మిత, అయేషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- *డీజీపీఎస్ సాంకేతికతతో కచ్చితమైన కొలతలు.. రైతులు అధికారులకు సహకరించాలి: అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి*



దశ, మంచాల : భూ రీసర్వేతో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి అన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా గురువారం మంచాల్ మండలం మనోరాబాద్ గ్రామంలో ఆయన అధ్యక్షతన భూ రీసర్వే గ్రామసభ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల ఆధునికీకరణ, భూముల కొలతల్లో కచ్చితత్వం, సరిహద్దు వివాదాల పరిష్కారం, భూ యజమానుల హక్కుల నిర్ధారణే రీసర్వే ప్రధాన లక్ష్యాలని వివరించారు.

ఆధునిక డీజీపీఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో భూములను కచ్చితంగా సర్వే చేసి డిజిటల్ రికార్డులు రూపొందిస్తామని తెలిపారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణాన్ని స్పష్టంగా గుర్తించడం వల్ల రైతుల మధ్య వివాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. పాత భూ రికార్డులను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు భూముల ఆక్రమణలను గుర్తించడం, సబ్‌డివిజన్ వివరాలను నమోదు చేయడం సాధ్యమవుతుందని చెప్పారు. కచ్చితమైన రికార్డుల వల్ల రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు పొందడంలో సౌలభ్యం కలుగుతుందని వివరించారు. గ్రామసభలో మనోరాబాద్ భూ వివరాలను అధికారులు వెల్లడించారు. గ్రామ మొత్తం భౌగోళిక విస్తీర్ణం 288 ఎకరాల 7 గుంటలు కాగా, 48 సర్వే నంబర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో పట్టా భూమి 267 ఎకరాల 16 గుంటలు, ప్రభుత్వ భూమి 18 ఎకరాల 35 గుంటలుగా వివరించారు. ప్రభుత్వ భూముల్లో ఎండోమెంట్ భూమి 3 ఎకరాలు, ప్రభుత్వ భూమి 10 ఎకరాల 5 గుంటలు, లావణ్య పట్టా భూమి 5 ఎకరాల 30 గుంటలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. రీసర్వే చేయాల్సిన సబ్‌డివిజన్ నంబర్లు 388 ఉన్నట్లు వెల్లడించారు.

రీసర్వే ప్రక్రియలో రైతులందరూ చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాత భూ రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, ఇతర సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. సర్వే సమయంలో తమ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవాలని సూచించారు. రీసర్వే అనంతరం నిబంధనల ప్రకారం కొత్త భూ రికార్డులు, పట్టా వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ ఎస్ఎల్ఆర్ ఎం. రామారెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి, మంచాల్ తహసీల్దార్ వి. ప్రసాద్‌రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే డి. శ్రీనివాస్, మండల సర్వేయర్ ఎస్.వి. ధనశ్రీ, లైసెన్స్ సర్వేయర్లు, గ్రామ పాలన అధికారి ఎన్. జంగయ్య, సర్పంచ్ ఎ. సంజీవరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులే వెన్నుముక

- *కార్మికుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం: చౌటుప్పల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్*

దశ, చౌటుప్పల్ : పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. పట్టణం బాగుండాలంటే ముందుగా పారిశుద్ధ్య కార్మికులు బాగుండాలని పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, దుస్తులు, గ్లౌజులు, మాస్కులు, సబ్బులు, కొబ్బరినూనె, బెల్లం, టవల్స్, షూస్, పీపీఈ కిట్లు తదితర నిత్యావసర వస్తువులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని వారికి ప్రభుత్వపరంగా అందాల్సిన అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులను తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత రక్షణ పరికరాలైన పీపీఈ కిట్లను తప్పనిసరిగా వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పట్టణ పరిశుభ్రత కోసం అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్‌కుమార్, కౌన్సిలర్లు గడ్డం ఇందిరా రాజరత్నం, పిల్లలమర్రి మధుసూదన్, కోఆప్షన్ సభ్యుడు పస్తం గంగారామ్, నాయకులు పల్లె సురేందర్‌రెడ్డి, ఉడుగు రమేష్, బత్తుల దాసు, దేప రాజు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్వో అంజయ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, జవాన్లు, పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.



తాండూరులో బస్సులు కరువు

- ఆర్టీసీ ఆధ్వర్యంలో తాండూర్ టాప్
- ఉదయం సాయంత్రం భారీగా రద్దీ
- పట్టించుకోని ఆర్టీసీ యంత్రాంగం
- దూర ప్రాంతాల నుంచి రావడానికి కష్టంగా ఉంది
- ఐదు నిమిషాలకు ఒక వస్తువులే మహబూబ్నగర్ కి ఇప్పుడు 30 నిమిషాలకు ఒకటి
- సంగారెడ్డి బస్సు రెండు గంటలకు ఒకటి
- గ్రామాలను మర్చిపోయిన తాండూర్ ఆర్టిసి



దశ,తాండూర్ ప్రతినిధి: వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం వ్యాపారానికి పెట్టింది పేరు. తాండూరులో వివిధ వ్యాపార కార్యకారపాల్లో జోరుగా సాగుతాయి. అనేక గ్రామాల నుంచి తాండూరు పట్టణానికి నిత్యం వేల సంఖ్యలను ప్రజలు వస్తుంటారు. తాండూరు పట్టణంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వివిధ ట్రైన్ సౌకర్యాలు బస్సు సౌకర్యాలు కందుల మార్కెట్ ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలు ప్రైవేట్ కి సంబంధించిన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇలా నిత్యం తాండూర్ ఎప్పుడు రద్దీగా ఉంటుంది కానీ ప్రయాణికులకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులు అయితే బస్సు డోర్ల దగ్గర నిలబడి అమ్మాయిలకు అయితే మరీ ఘోరంగా ఉంది అసలు కాలేజీకి వెళ్లాలా లేదా అనేది కూడా ఆలోచిస్తున్నారు.

మహబూబ్నగర్ కి 30 నిమిషాలకు ఒక బస్సు

ఒకప్పుడు మహబూబ్నగర్ కి ఐదు నిమిషాలకు ఒక బస్సు తప్పనిసరిగా వచ్చేది కానీ ఇప్పుడు 30 నిమిషాలు అయినా ఒక బస్సు రావడం లేదు వస్తుందన్న గ్యారెంటీ లేదు. మహబూబ్నగర్ కి తాండూర్ నుంచి 90 కిలోమీటర్ల దూరం ఉంటుంది. దాదాపు 50 కి పైగా గ్రామాలు ఇదే మార్గంలో ఉంటాయి. నిత్యం వేల మంది తాండూర్ మహబూబ్నగర్కు ప్రయాణం చేస్తుంటారు. ఎంత బాగానే ఉన్నా ఐదు నిమిషాలకు ఒకసారి బస్సు వస్తేనే బస్సు ఫుల్ గా వెళ్ళేది. అలాంటిది ఇప్పుడు 30 నిమిషాలకు ఒక బస్సు వెయ్యడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా సంగారెడ్డికి కూడా తాండూర్ నుంచి 30 నిమిషాలకు ఒక బస్సు వెళ్ళేది అలాంటిది ఎప్పుడు రెండు గంటలు అయినా ఒక వస్తువు కూడా లేదు ఒక వస్తువు వెళ్లిందంటే మరో బస్సు ఎప్పుడు వస్తుందో కూడా ప్రయాణికులకు తెలియడం లేదు. రాష్ట్ర రాజధాని అయినటువంటి హైదరాబాద్కు కూడా సరైన బస్సు సౌకర్యాలు లేవు. ఇదే మార్గంలో వికారాబాద్ కూడా ఉంటుంది వెళ్లడానికి సరైన బస్సులు ఉండవు.


పట్టించుకోని ఎంక్వైరీ ఆఫీస్

తాండూరులో పేరుకు మాత్రమే ఎంక్వయిరీ ఆఫీస్ ఉంది. బస్సుల సమయపాలన ఎప్పుడు వస్తాయి ఎప్పుడు వెళ్తాయో ప్రజలకు నిత్యం సమాచారం అందించవలసి ఉంటుంది కానీ అక్కడ ఒక్క ఆఫీసర్ కూడా ఉండదు ఒక బస్సు వచ్చిందా రాలేదా అని తెలియని ప్రజలు అలగాలంటే సామాన్యంగా ఇంక్వైరీ ఆఫీసుకు వెళ్లి అడగాలి కానీ తాండూర్ లో మాత్రం కిరాణా షాపుల అవ్వాలని లేదా బస్సు కోసం నిలబడ్డవ్వాలని అడగడం తప్ప మరేమీ చేయలేకపోతున్నారు. పలు సమాచారం సరిగ్గా ఇస్తారన్న గారికి కూడా ఉండదు.

ఆర్టీసీ ఆదాయంలో తాండూరు టాప్

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆర్టీసీ నుంచి వచ్చే ఆదాయ మార్గాలలో తాండూర్ పట్టణం నుంచే ఎక్కువ ఆదాయం సమకూరుతుంది సుమారుగా రోజుకు 18 నుంచి 22 కోట్ల రూపాయల ఆదాయం ఆర్టీసీకి వస్తుంది. ఇంత భారీగా ఆదాయం వచ్చినా కానీ ఆర్టీసీలోని అధికారులు మాత్రం సరిగా పనిచేయడం. ఎక్కువగా బస్సులు నడపడం లేదు. అసలు గ్రామాలను ఎవరు పట్టించుకోవడం వేరు. పెద్ద పెద్ద గ్రామాలకు ఒక బస్సు ప్రతిరోజు అదే నడిచేది. అలాంటిది ఇప్పుడు రోజుకు రెండు పూటలు రావడమే గగనం అయిపోయింది. దయచేసి బస్సులను సకాలంలో నడిపే ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించకూడదని ప్రజలు కోరుకుంటున్నారు.

ఉద్యమకారుడు దొనాల రవికుమార్ అక్రమ అరెస్ట్ దుర్మార్గం!



దశ, నర్సంపేట: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం ముట్టడికి వెళ్తున్నారనే అనుమానంతో గురువారం ఉదయం ఉద్యమకారుడు దొనాల రవికుమార్ను నర్సంపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముందస్తు అరెస్టును తోటి ఉద్యమకారులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజా సమస్యలపై గళమెత్తే వారిపై నిర్బంధాలు విధించడం, ముందస్తు అరెస్టులు చేయడం సరైంది కాదని వారు పేర్కొన్నారు. దొనాల రవికుమార్ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఆఫీస్ కరస్పాండెన్స్ పుస్తకం

పుస్తకాన్ని ఆవిష్కరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



దశ ఓయూ: ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు 'ఏకాంప్రహెన్సివ్ బుక్ ఆన్ ఆఫీస్ కరస్పాండెన్స్' పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. తార్నాకలోని తన నివాసంలో గురువారం రచయిత అబ్బూరి వెంకటరమణ రచించిన ఈ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ..ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు నుంచి ఆంగ్లంలోకి అనువాదం చేసే సమయంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈ పుస్తకం అధిగమించేందుకు దోహదపడుతుందన్నారు. గతంలో న్యాయవాదులకు ఉపయోగపడే పుస్తకాన్ని రచించిన అబ్బూరి వెంకటరమణ, ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులకు, ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా ఆఫీస్ కరస్పాండెన్స్పై సమగ్ర పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో ఏవీఆర్కే కాంత్, రాధాకృష్ణ, రామ్వర్మ తదితరులు పాల్గొన్నారు.



విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్లు

నిధుల మంజూరుపై సీఎం రేవంత్రెడ్డి, మంత్రి పొన్నం, వీహెచ్కు కుందారం గణేష్ చారి కృతజ్ఞతలు

దశ ఓయూ: ఉప్పల్ భగాయత్లో విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్స్ జారీ చేయడం హర్షణీయమని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. ఈ మేరకు గురువారం మినిస్టర్ క్వార్టర్స్లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులకు నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ చారి మాట్లాడుతూ.. ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపిన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, వీహెచ్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రూ.88.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు.

ఈ భవనాలు పూర్తయితే బీసీ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, వసతి సౌకర్యాలతో పాటు సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా నిధులు మంజూరు చేయడం పట్ల బీసీ సంఘాల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లాల్కోట వెంకటాచారి, బొడ్డుపల్లి సుందర, వేములవాడ మదన్మోహన్, వడ్ల హనుమల్లు, ఎర్రోజు వేణు, బలవంత చారి, పులివెందుల యాదగిరి, పులి శ్రీనివాస్ చారి, వల్లబోజు నరసింహాచారి, అనంత బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి

- పడాదికి 200 రోజుల పని కల్పించాలి
- రోజుకు రూ.800 కూలి చెల్లించాలి
- నవంబర్ 6న హైదరాబాద్లో జరిగే ధర్నాను జయప్రదం చేయండి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

దశ, తాండూర్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో నివసిస్తున్న పట్టణ పేదలకు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తూ యాలాల మండల కేంద్రంలో బుధవారం కరపత్రం ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న ఉపాధి హామీ పథకం తరహాలో పట్టణ ప్రాంతాల్లో కూడా పేదలకు ఉపాధి కల్పించే విధంగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు.

రోజురోజుకూ పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం కారణంగా పట్టణ పేదలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాల్లో నివసించే పేద కుటుంబాలకు సంవత్సరానికి కనీసం 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.800 కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మెట్రో నగరాలు, పట్టణ ప్రాంతాల్లో జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలను నిర్ణయించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలను పెంచాలని కోరారు. పేదలకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కేవలం హామీలతో కాలం గడపకుండా చట్టబద్ధమైన ఉపాధి హక్కును కల్పించాలని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ డిమాండ్ల సాధన కోసం నవంబర్ 6న హైదరాబాద్ కమిషనరేట్ నిర్వహించే ధర్నాలో వ్యవసాయ కార్మికులు, పట్టణ పేదలు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు నిచ్చింది. ఈ కార్యక్రమం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు యు. బుగ్గప్ప, ఎం. వెంకటయ్య, నాయకులు చంద్రప్ప,రఘుపతి, నర్సిములు పాల్గొన్నారు.

సైనిక పాఠశాలల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల



దశ ,తాండూర్ ప్రతినిధి: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్-2027 (ఏఐఎస్ఎస్ఈఈ)కు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టిఏ) నోటిఫికేషన్ విడుదల చేసింది. సైనిక పాఠశాలల్లో 6వ, 9వ తరగతిలలో ప్రవేశాలకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిసెంబరు నెల 2వ తేదీ లోపు ఆన్లైన్ వెబ్సైట్ ఎన్టిఏ.ఎసి.ఇన్ నందు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు. జనరల్, ఓబీసీ అభ్యర్థులు దరఖాస్తు రుసుం రూ.850, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు రూ.700 ఫీజు చెల్లించాల్సి ఉంది. ఆలస్య రుసుముతో డిసెంబరు నెల 3 నుంచి 6వ తేదీ రాత్రి 11.50 గంటల లోపు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. డిసెంబరు 7 నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తులలో మార్పులు, చేర్పులు, జనవరి 11న పరీక్షా కేంద్రాల సమాచారం, జనవరి 25వ తేదీ నుంచి ఎన్టిఏ వైబ్సైట్లో అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంటాయన్నారు. జనవరి 31న మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు 6వ తరగతి ప్రవేశ పరీక్ష, 2 నుంచి 5 గంటల వరకు 9వ తరగతి పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. కాగా కలికిరి సైనిక పాఠశాలలో 6వ తరగతికి 72 సీట్లు, 9వ తరగతికి 9 సీట్లు ఖాళీ వున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలల వెబ్సైట్ లేదా ఎన్టిఏ వెబ్సైట్లో చూడవచ్చన్నారు.

కొడంగల్లో మెగా రైతు మేళా

- పంటల సాగుపై రైతులకు అవగాహన
- 150 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు
- ఈ నెల 7 నుంచి 9 వరకు ప్రదర్శన



దశ, తాండూర్ ప్రతినిధి: కొడంగల్లో ఈ నెల 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు మెగా రైతు మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ నెల 7న ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మేళాను ప్రారంభించనున్నారని తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయంలో అధిక ఆదాయం సాధించే ప్రత్యామ్నాయ మార్గాలను పరిచయం చేయడమే మేళా ఉద్దేశమని మంత్రి చెప్పారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక యంత్రాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, అధిక దిగుబడులు, ఆదాయం అందించే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 26 ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థల భాగస్వామ్యంతో సుమారు 150 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, ఆయిల్ఫెడ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పశుసంవర్ధక శాఖ, బ్యాంకింగ్ సంస్థలు, విత్తన పరిశ్రమ, వాలంతరి, క్రిడా తదితర సంస్థలు ఇందులో పాల్గొననున్నాయన్నారు. మూడు రోజుల రైతు మేళాలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులు, అవార్డులు పొందిన ప్రగతిశీల రైతులతో ప్రత్యేక సాంకేతిక సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

మొదటి రోజు ముఖ్యమంత్రి రైతులకు పలు వ్యవసాయ పరికరాలు,యంత్రాలు,యూనిట్లను అందిస్తారన్నారు.వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, సాంకేతిక సంస్థలతో నేరుగా మాట్లాడి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకునేందుకు ఈ మేళా రైతులకు మంచి అవకాశమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులందరూ మూడు రోజుల మేళాలో పాల్గొని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎర్రకుంట శ్మశానవాటికలో పారిశుద్ధ్య పనులు అంతంతమాత్రమే!

- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం.. దీపావళి వేడుకలకు ఇబ్బందులు తప్పవని ఆందోళన



దశ ఓయూ: దీపావళి పండుగను పురస్కరించుకుని నాచారం ఎర్రకుంట శ్మశానవాటికలో చేపట్టిన పారిశుద్ధ్య పనులు ఈ ఏడాది అంతంతమాత్రంగానే సాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా దీపావళికి ముందు శ్మశానవాటికలో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేసేవారు. దీంతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగను ఘనంగా జరుపుకునేవారు. అయితే ఈ ఏడాది కాప్రా డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్ పర్యవేక్షణలో, స్థానిక జీహెచ్ఎంసీ జవాన్ నరేష్ సమక్షంలో నామమాత్రంగా మాత్రమే పనులు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లేదని వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే దీపావళి వేడుకల సందర్భంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎర్రకుంట శ్మశానవాటికలో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టి, ప్రజలు ఇబ్బందులు లేకుండా పండుగ జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడల్లోనూ, చదువుల్లోనూ యువత రాణించాలి

- తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెల్లడి
- తాండూరు జూనియర్ కళాశాలలో పాల్గొన్న ఎమ్మెల్యే
- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం నిర్వహణ
- టీసీల్ -2026 ట్రస్మా క్రికెట్ లీగ్ను ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



దశ,తాండూర్ ప్రతినిధి: తాండూర్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు నిర్వహించిన క్రీడ పోటీలు ఘనంగా జరిగాయి. ఇందులో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి యువత మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయించకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి. క్రికెట్, ఫుట్బాల్, వాలీబాల్ వంటి ఆటల్లో చురుగ్గా పాల్గొనాలి. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి.చదువు ఎంత ముఖ్యమో క్రీడలు, ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించే అలవాటు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను, ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొనే మనోధైర్యాన్ని ఇస్తుంది.ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, క్రీడల్లోనూ చదువుల్లోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో, లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలి.

టీసీల్ 2026 ట్రస్మా క్రికెట్ లీగ్ను ఇంత అద్భుతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రవేట్ పాఠశాలల యజమానులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.